పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పెద్దపీట


హస్తినాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న సుజాతానాయక్, శశిధర్‌రెడ్డి


కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో నల్లా రఘుమారెడ్డి

హస్తినాపురం: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ పెద్ద పీట వేస్తుందని, పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శుక్రవారం ఆమె హస్తినాపురం డివిజన్‌లోని శివసాయినగర్ కాలనీలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దెంది శశిధర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డికి మద్దతుగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఏ ప్రాంతానికి వెళ్లినా కాంగ్రెస్ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని సుజాతా నాయక్ అన్నారు.కార్యక్రమంలో నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి , మమత మల్లేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రజా సంక్షేమం కనుమరుగు: నల్లా

చంపాపేట: బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజా సంక్షేమ పథకాలు కనుమరుగు అయ్యాయని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ పాలక మండలి చైర్మన్ నల్లా రఘుమారెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని నేతాజీనగర్, రెడ్డిబస్తీ, కటకోనికుంట కాలనీలలో ఇంటింటికీ వెళ్లి మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డికి ఓటువేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టడంతోనే బడుగు, బలహీన వర్గాల ఆశయం మేరకు ఇందిరమ్మ రాజ్యం సాధ్యపడుతుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీపాల్‌రెడ్డి, సామ రమణారెడ్డి, రఘునందన్‌రెడ్డి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నల్లా రఘుమారెడ్డి ఆధ్వర్యంలో చంపాపేట డివిజన్ కటకోనికుంట కాలనీ బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన మహిళా నేతలు రజని, లక్ష్మీ, నాగమణి, వెన్నెల, స్రవంతి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.



పురుషులే కీలకం

మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గంలో అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా పురుషులు, మహిళా ఓటర్ల వివరాలు

అసెంబ్లీ సెగ్మెంట్	పురుషులు	మహిళలు
మేడ్చల్	3,40,218	3,25,703
మల్కాజిగిరి	2,55,325	2,52,712
కుత్బుల్లాపూర్	3,78,362	3,46,468
కూకట్‌పల్లి	2,51,424	2,30,506
ఉప్పల్	2,79,495	2,60,516
కంటోన్మెంట్	1,26,699	1,26,997
ఎల్బీనగర్	3,14,101	2,90,528
మొత్తం	19,45,624	18,33,430

సాక్షి,మేడ్చల్ జిల్లా: దేశంలోనే అతి పెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో అభ్యర్థుల గెలుపోటములకు పురుషుల ఓట్లే కీలకం కానున్నాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో మొత్తం ఓటర్లు 37,79,596 మంది ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 19,45,624మంది కాగా, మహిళా ఓటర్లు 18,33,430 మంది ఉన్నారు. నియోజకవర్గంలో మహిళా ఓట్ల కంటే పురుషుల ఓట్లు 1,12,194 అధికంగా ఉన్నాయి. ప్రస్తుతం ఉప ఎన్నికలు జరుగుతున్న కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గం మినహాయించి మిగతా మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్,

- మల్కాజిగిరి లోక్‌సభలో మొత్తం ఓటర్లు 37.79లక్షలు
- పురుష ఓటర్లు 19.45లక్షల మంది
- మహిళ ఓటర్లు 18.33 లక్షల మంది

◆ కూకట్‌పల్లి, ఉప్పల్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల కంటే పురుష ఓటర్లే అధికంగా నమోదై ఉన్నారు. కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్లు1,26,699 మంది ఉండగా, మహిళా ఓటర్లు 1,26,997 మంది ఉన్నారు. ఇక్కడ మాత్రం పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు 328 మంది మాత్రమే ఎక్కువగా ఉన్నారు.

◆ **రెండు నెలల్లో పెరిగిన ఓటర్లు 51,077 మంది**

ఎన్నికల సంఘం ఫిబ్రవరి 8న తుది ఎన్నికల జాబితా ప్రకటించింది. ఈ ఎన్నికల ఓటర్ల తుది జాబితా ప్రకారం మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలలో మొత్తం ఓటర్ల సంఖ్య 37,28,519 కాగా, ఏప్రిల్ 25న ఎన్నికల సంఘం ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం ఓటర్ల సంఖ్య37,79,596 ఉంది. ఈ ఓటర్ల జాబితాను అనుసరించి దాదాపు రెండు నెలల వ్యవధిలోనే మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో 51,077 మంది ఓటర్లు పెరిగారు.

మల్కాజిగిరి సమస్యల పరిష్కారానికి కృషి

మల్కాజిగిరి స్వతంత్ర ఎంపీ అభ్యర్థి వైష్ణవి ప్రసాద్


ఎల్‌బీనగర్‌లో ప్రచారం చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి వైష్ణవీ ప్రసాద్

నాగోలు: మల్కాజిగిరి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని మల్కాజిగిరి స్వతంత్ర అభ్యర్థి పెండ్యాల శేషసాయి వరప్రసాద్ (వైష్ణవీ ప్రసాద్) అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ నియోజకవర్గ పరిధిలోని ఆర్టీసీ కాలనీ, ఎల్‌బీనగర్, లింగోజిగూడ, చైతన్యపురితో పాటు వివిధ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో పరిధిలో ఉన్న రైల్వే క్రాసింగ్ సమస్యలు, కంటోన్మెంట్ రోడ్ల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ప్రజా సంకల్పంతో మల్కాజిగిరిని అభివృద్ధి పథంలో ముందు ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రతి ఇంటికీ సంక్షేమం, పేదల కోసం, ప్రగతి కోసం పనిచేస్తానని ఆయన తెలిపారు. ఆకలి, అనారోగ్యం లేని భారత్ కోసం నిరంతరం పనిచేస్తానని తెలిపారు. బ్రహ్మశ్రీ సుభాష్ పత్రిజీ ఆశీస్సులతో పిరమిడ్ పార్టీ బలపర్చిన తన ఫ్లూట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వైష్ణవీ ప్రసాద్‌కు కాలనీ వాసులు పెద్దఎత్తున సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, లక్ష్మణ్‌రావు వివిధ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో యువకుల చేరిక


ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

వనస్థలిపురం: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దూసరి మధుగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం వనస్థలిపురం డివిజన్‌కు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు చేగోని విఠల్‌గౌడ్, రామకృష్ణ, యువకులు నిఖిల్, రోహిత్, సంపత్, పవన్, హరీష్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి: దేప


ఆర్‌కేపురంలో ప్రచారం చేస్తున్న నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహేశ్వరం నియోజవర్గం సీనియర్ నాయకుడు, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో గడప గడపకూ కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్‌కేపురంలో..

పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలిపించాలని ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత అన్నారు. డివిజన్‌లోని సౌభాగ్యపురం కాలనీలో యువజన కాంగ్రెస్ పార్టీ నాయకుడు పెద్దవూర సైదులు ఆధ్వర్యంలో గడప గడపకూ కాంగ్రెస్ పార్టీ నినాదంతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు శ్యామ్‌సుందర్, పగడాల ఎల్లన్న, వి. పాండు, చిలకరాజు సాయి జగదీష్, కనుగుల సాయికిరణ్, శైలజ, సామిడి శివ, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురంలో కాంగ్రెస్ శ్రేణుల ప్రచారం



వనస్థలిపురం: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడు కుట్ల నర్సింహ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని సద్గురునగర్, గుంటి జంగయ్య నగర్, పార్థీవాడ, యశోదనగర్, శ్రీకృష్ణానగర్, రేడియో కాలనీల్లో గడప గడపకూ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. నాయకులు స్వర్ణమాధవి, వేములయ్యగౌడ్, భాను, శ్రీను, కవిత, స్వప్న, రత్నకుమారి, నరేష్, సంతోష్ పాల్గొన్నారు.

హాస్టల్‌లో విద్యార్థి ఆత్మహత్య

మలక్‌పేట: హాస్టల్‌లో డిగ్రీ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మలక్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా, చింతనెక్కొండ గ్రామానికి చెందిన పతిరి లక్ష్మయ్య కొడుకు యాకయ్య(19) సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో బీఏ ఫస్ట్ ఇయర్ చదువుతూ, సైదాబాద్ డివిజన్ రెవెన్యూబోర్డు కాలనీలోని ప్రభుత్వ బాలుర కాలేజీ వసతి గృహంలో ఉంటున్నాడు. శుక్రవారం హాస్టల్ భవనం 3వ అంతస్తులోని గదిలో పైకప్పు కొక్కేనికి టవల్‌తో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, అనుమానాస్పద స్థితి విద్యార్థి మృతి చెందాడని సమాచారం అందడంతో మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్సై నవీన్, క్లూస్‌టీం ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమ వ్యవహారమై వారం రోజులుగా కుటుంబంలో గొడవ జరుగుతోందని, దీంతో మనస్తాపం చెంది యాకయ్య ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇలా ఉండగా, సోషల్ వెల్ఫేర్ శాఖ హైదరాబాద్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ పెరిక యాదయ్య, ఏఎస్‌డబ్ల్యూ గట్టుమల్లు ఘటనా జరిగిన హాస్టల్‌కు వచ్చి విద్యార్థులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రూ.5.89 లక్షలు పట్టివేత

మలక్‌పేట: ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.5.89 లక్షల నగదును పట్టుకున్నట్టు మలక్‌పేట ఎస్సై నవీన్ తెలిపారు. శుక్రవారం అస్మాన్‌ఘడ్ గౌతమ్ స్కూల్ చౌరస్తాలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు ఏటీఎంల్లో డబ్బులు పెట్టే వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా రూ.5.89 లక్షలు నగదు లభ్యమైంది. ఆ డబ్బుకు సంబంధించి సరైన పత్రాలను చూపించకపోవడంతో నగదును స్వాధీనం చేసుకుని ఎన్నికల కమిషన్‌కు పంపించామని ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా కన్నా మహేష్



మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ అసెంబ్లీ కో ఆర్డినేటర్‌గా మన్సూరాబాద్ డివిజన్ సహారా స్టేట్స్ కాలనీకి చెందిన కన్నా మహేష్‌కుమార్‌ను నియమిస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, సీఎం రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కన్నా మహేష్ మన్సూరాబాద్‌లో మాట్లాడుతూ, గత అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ విజయంలో తాను భాగస్వామి అయినందున సికింద్రాబాద్ అసెంబ్లీకి కో ఆర్డినేటర్‌గా నియమించారన్నారు. తన నియామకానికి సహకరించిన ఎంపీ రేణుకచౌదరి, కొత్వాల్, పార్టీ పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

హోం ఓటింగ్ షురూ


కుర్మగూడలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న దివ్యాంగురాలు

చంచల్‌గూడ: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దివ్యాంగులు, వయోవృద్ధులు తమ ఇంటి వద్దే ఓటు వేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘం తొలిసారిగా హోం ఓటింగ్‌కు వెసులుబాటు కల్పించింది. శుక్రవారం నుంచి ఈ ప్రక్రియ ప్రారంభమైంది. కుర్మగూడ డివిజన్‌లో ఎన్నికల అధికారులు దివ్యాంగులు, వయోవృద్ధుల వద్దకు వెళ్లి బ్యాలెట్ పేపర్‌పై ఓటు వేయించి సీల్ వేసి ఉన్న పెద్ద డబ్బాలో వేయించారు.

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో..

3500 ఇందిరమ్మ ఇళ్లు

కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి సునీతారెడ్డి


హయత్‌నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న పట్నం సునీతామహేందర్‌రెడ్డి

మన్సూరాబాద్: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి సునీతా మహేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె మన్సూరాబాద్ డివిజన్‌లో టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ, రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రంగారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వీరన్నగుట్ట నుంచి ప్రారంభమైన ప్రచారం పలు కాలనీల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సునీతా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ, తనను గెలిపిస్తే ఐదేళ్ల పాటు ప్రజలకు సేవా చేస్తానని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నందున నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు తీసుకు వస్తానని స్పష్టంచేశారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన తనకు ఇక్కడి సమస్యలు తెలుసని, వాటిని పరిష్కరిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దగొని రామ్మోహన్‌గౌడ్, భీమిడి రామకృష్ణారెడ్డి, పన్యాల జైపాల్‌రెడ్డి, జాల వెంకట్‌రెడ్డి, లింగం, సందీప్, కళ్లెం సుజాతా రెడ్డి, జానకి, ఎర్ర మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

కాసానికి మద్దతుగా ప్రచారం


సిరినగర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ కోరారు. శుక్రవారం ఆర్‌కేపురం డివిజన్ సిరినగర్, వాస్తు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరవింద్ శర్మ మాట్లాడుతూ, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అసత్య ప్రచారంతో అధికారంలోకి వచ్చిందన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సాజిద్, గొడుగు శ్రీనివాస్, శేఖర్, కొండ్ర శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, జైశ్రీమన్నారాయణ, పెంబర్తి శ్రీనివాస్, రహీం తదితరులు పాల్గొన్నారు.

మోదీ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

చైతన్యపురి: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ గెలుపునకు కృషి చేయాలని చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్తా అన్నారు. డివిజన్‌లోని భవానీనగర్ కాలనీలో నిర్వహించిన బీజేపీ ఇంటింటి ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు వినోద్‌యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రుద్రారపు శంకర్, నాయకులు రాంమోహన్, శ్రీకాంత్‌రెడ్డి, దీపక్‌రెడ్డి యశోద, జానకి తదితరులు పాల్గొన్నారు.

గడ్డిఅన్నారంలో...

బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి కోరారు. శ్రీకృష్ణానగర్, కోదండరాంనగర్, శ్రీనగర్ కాలనీలలో కార్పొరేటర్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. నాయకులు మురళి, నగేష్‌నాయక్, వెంకటేశ్‌చారి, శ్రవణ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, అనిల్, మణిదీప్‌నాయుడు, వంశీకృష్ణ, రత్నం, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్‌లో చేరిన కొత్తపేట బీఆర్‌ఎస్ నాయకులు



నాగోలు:పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ అన్నారు. కొత్తపేట డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొమ్ము బాబు, టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, కొత్తపేట డివిజన్ ఎన్నికల ఇన్‌ఛార్జి వజీర్ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కార్యాలయంలో శుక్రవారం మధు యాష్కీగౌడ్, పట్నం సునీతా మహేందర్ రెడ్డి సమక్షంలో కొత్తపేట డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగాల కిషోర్ గౌడ్, బాలకృష్ణ, కొమ్ము సందీప్, ఎర్రోళ్ల కృష్ణ, గిరిబాబు, రమేష్, పద్మమ్మ, జ్యోతి, గీత, స్వర్ణక్క పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో కాంగ్రెస్ జెండా ఎగరేద్దాం:ఉప్పల


ఫతుల్లాగూడలో ప్రచారం నిర్వహిస్తున్న శ్రీనివాస్ గుప్తా తదితరులు

నాగోలు: పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరేద్దామని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు , టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం నాగోల్ డివిజన్ పరిధిలోని ఫతుల్లాగూడలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ, ఈనెల 13న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి మల్కాజిగిరి ఎంపీగా పట్నం సునీతామహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లో 4 గ్యారంటీలను అమలు చేసిందని, అదే విధంగా 6 గ్యారంటీలను తప్పక నెరవేరుస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగస్టు 15 నాటికి 2 లక్షల రుణ మాఫీ తప్పక చేస్తామని ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. ప్రచారంలో చిరంజీవి గౌడ్ , కటకం శ్రీనివాస్, భవానీ, బద్రి, మహిళ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్ అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలి

లింగోజిగూడ: ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్, లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని కాకతీయ కాలనీలో నిర్వహించిన ఎన్నికల సమావేశంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం ప్రభుత్వంపై వ్యతిరేకంగా మాట్లాడుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరు చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో లక్ష్మారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పల్సామ్, శ్రీధర్ గౌడ్, మహిళా అధ్యక్షురాలు రాజేశ్వరి, వసంత, జ్యోతి, శివ గౌడ్, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

జాకీర్ హుస్సేన్ సేవలు చిరస్మరణీయం

చాదర్‌ఘాట్: భారత మాజీ రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జాకీర్ హుస్సేన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చౌకి రవికుమార్, జాఫర్ ఇక్బాల్, మహ్మద్ గౌసుద్దీన్ పాల్గొన్నారు.

దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యం: ఈటల

ఎల్‌బీనగర్: దేశ అభివృద్ధి ప్రధానమంత్రి మోదీతోనే సాధ్యమని, బీజేపీ రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఉందని మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారం భాగంగా శుక్రవారం బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రెడ్ వాటర్‌ట్యాంక్ నుంచి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తా వరకు స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు షోలో రాజేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌బీనగర్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు వంగ మధుసూదన్ రెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డి, పవన్‌కుమార్, నాయకులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొత్త రవీందర్‌గౌడ్, కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


ఈటలకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వ్యక్తి అదృశ్యం


రవితేజ

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి కనిపించకుండాపోయిన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నాగోలు రాజ్యలక్ష్మీ కాలనీకి చెందిన పాడెం రవితేజ(33) ఈ నెల 2 నుంచి ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో అతడి భార్య స్వప్న శుక్రవారం నాగోలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓయో లాడ్జిలో అగ్నిప్రమాదం .. ఇద్దరికి స్వల్పగాయాలు

చైతన్యపురి: మోహన్‌నగర్‌లోని ఓయో లాడ్జిలో గురువారం తెల్లవారు జామున అగ్నిప్రమాదం జరిగింది. చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం... తెల్లవారు జామున 3.30 గంటల ప్రాంతంలో వెంకటేశ్వర అతిథి ఓయో లాడ్జి భవనంలో మంటలు వచ్చాయి. గదుల్లోకి దట్టమైన పొగ వ్యాపించటంతో మొదటి అంతస్తులో ఉన్న కొందరు బయటకు వచ్చారు. సమాచారం అందుకున్న చైతన్యపురి పోలీసులు మూడు ఫైర్ ఇంజిన్లను రప్పించి మంటలు ఆర్పి 2,3 అంతస్తుల్లో చిక్కుకున్న వారిని రక్షించారు. లాడ్జి పక్కన ఉన్న భవనంపై నుంచి నిచ్చెన వేసి 8 మందిని సురక్షితంగా కిందకు దించారు. పొగ పీల్చడంతో అస్వస్థతకు గురైన ఇద్దరిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మరో ఇద్దరు మొదటి అంతస్తు కిటికీ నుంచి దూకడంతో స్వల్పంగా కాలిన గాయాలయ్యాయి. అయితే, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో పోలీసులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు వ్యాపించినట్లు భావిస్తున్నారు. కాగా, లాడ్జిలో ఎటువంటి అగ్నిమాపక నియంత్రణ పరికరాలు అందుబాటులో లేవని సంజు అనే యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లాడ్జి నిర్వాహకుడు వేగుల నాగసిద్ధార్థపై కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

● రాజకీయ లబ్ధికోసమే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం ● బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న సామ రంగారెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు

మన్సూరాబాద్: మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, వాటిని ఎత్తేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ వర్గాల రిజర్వేషన్లను పెంచుతామని బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన ఎల్‌బీనగర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీ బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ పార్టీపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతతో పాటు 6 గ్యారంటీ, 60 హామీలంటూ మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని రంగారెడ్డి అన్నారు. గత యూపీఏ ప్రభుత్వ హయాంలో ఎన్నో కుంభకోణాలు జరిగాయని, మోదీ ప్రభుత్వ హయాంలో ఒక్క కుంభకోణం గా కూడా జరగలేదన్నారు. కేంద్రమంత్రి అమిత్‌షా వీడియోను మార్ఫింగ్ చేసి సీఎం రేవంత్ రెడ్డి టీమ్ తప్పుడు ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాలు ఎన్ని చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరని, ప్రపంచ దేశాల నుంచి ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతు పలుకుతున్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 12 స్థానాల్లో గెలుస్తుందని సర్వే రిపోర్టుల ద్వారా తెలుస్తోందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, రంగ నర్సింహ గుప్తా, కొప్పుల నర్సింహా రెడ్డి, బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి, మొద్దు లచ్చిరెడ్డి, పవన్‌కుమార్, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు కొత్త రవీందర్‌గౌడ్, బండారు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వంద కోట్లు ఇస్తే పార్టీ మారతా!

కార్పొరేటర్లు పార్టీ ఫిరాయించేందుకు సిద్ధంగా ఉన్నారా అని విలేకరులు ప్రశ్నించగా, సీఎం రేవంత్‌రెడ్డి రూ.100 కోట్లు ఇస్తే పార్టీ మారతానని చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి వ్యంగ్యంగా సమాధానం ఇచ్చారు. బీజేపీ కార్పొరేటర్లు పార్టీ ఫిరాయిస్తున్నారనే ఆరోపణల్లో నిజం లేదని బీజేపీ కార్పొరేటర్లు స్పష్టం చేశారు.